క్లుప్తంగా

రాలుతున్న మామిడి కాయలు



వీపనగండ్ల: అధిక ఉష్ణోగ్రతలతో మామిడితోటల్లో వచ్చిన కొద్దిపాటి మామిడికాయల దిగుబడి రాలుతుండడంతో మామిడి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ యాసంగిలో దాదాపు 80 శాతం తోటలు దిగుబడికి నోచుకోలేదు. కొద్దిపాటి మామిడికాయలకు మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని మామిడి తోటల రైతులు కోరుతున్నారు. సమీప పట్టణమైన కొల్లాపూర్‌లో మామిడి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ ప్రార్థనలు



ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు ఆదివారం రాత్రి స్థానిక మసీదే నూర్‌లో, మస్జిదే సయ్యదీయాలో సనా ఫొటో స్టుడియో ఆధ్వర్యంలో పూలహమీద్ కుమారుల ఆధ్వర్యంలో ఇఫ్తార్‌ను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలాన అబ్దుల్‌అలీంరశాది, హఫీజ్ అజ్హర్‌అలీ ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు తౌఫిక్, అయ్యూబ్, జుబేర్, ఇంతియాజ్, ఖయ్యూం, నవీద్, రియాజ్‌అలీ, అజ్హర్, అన్వర్, జహంగీర్, మాసూం, సాధిఖ్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి ఇఫ్తార్



అమరచింత: పట్టణ జామీయ మసీదులో ఆదివారం పిన్నంచర్లకి చెందిన సీపీఐ నాయకుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాబర్ట్ ఆధ్వర్యంలో ఉపవాస దీక్ష పరులకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం తమవంతుగా రోజా పాటించే వారికి పండ్లను ఇచ్చి ఇఫ్తార్ ఇవ్వడం జరుగుతుందని, ఈ సారి అన్ని రకాల పండ్లను జామీయ మసీదు మౌలానాకు అందించి ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించామని చెప్పారు. కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.

సీఆర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌కు చెందిన రమేష్, కిష్టాపూర్‌తండాకు చెందిన దాసునాయక్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం ముష్టిపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ జగదీశ్వర్‌రావును కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో సాగునీటి కాల్వల అభివృద్ధికి తోడ్పాటునందించాలని వారు సీఆర్‌ను కోరారు.

బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేయండి



వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి గ్రామ సమీపంలో నిర్మించిన బ్రిడ్జి పూర్తిస్థాయి నిర్మాణానికి నోచుకోకుండా నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రం నుంచి పెబ్బేరు పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి కావడం, అర్ధంతరంగా బ్రిడ్జి నిర్మాణం ఆగిపోవడంతో గోపల్‌దిన్నె, గోవర్ధనగిరి గ్రామాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సు కూడా నిలిపివేశారు. ఉన్నతాధికారులు స్పందించి నిలిపివేసిన బస్సులను పునరుద్ధరించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మానవత్వం చాటుకున్న చిన్నారులు



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని కడుకుంట్లలో కోతిపిల్ల మృతిచెందింది. గ్రామంలో ఎవరూ పటించుకోకపోవడంతో మానవత్వంతో నలుగురు చిన్నారులు కలిసి మృతిచెందిన కోతిపిల్లను అట్టపై తీసుకెళ్లి మట్టిలో పూడ్చిపెట్టారు. ఆ చిన్నారుల సేవను పలువురు అభినందించారు.

చిన్నారుల్లో పోషకాహార లోపం



మదనాపురంలో పౌష్టికాహారం అందజేస్తున్న అంగన్‌వాడీలు

- వయసుకు తగిన బరువు లేక ఇబ్బందులు
- తలెత్తుతున్న ఆరోగ్య సమస్యలు
- జిల్లాలో 456 మందికి పైగా గుర్తింపు

మదనాపురం: చిన్నారుల ఎదుగుదల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నాయి. పోషకాహారం అందక ఇబ్బందులు పడే పేద కుటుంబాల పిల్లల్లో ఎదుగుదల కనిపించడం లేదు. దీన్ని నివారించేందుకు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. స్త్రీశిశు సంక్షేమ శాఖ 15 రోజులకు ఒకసారి చిన్నారుల ఎత్తు, బరువులను గుర్తించి వారిలో ఎదుగుదల లోపించిన పిల్లలను గుర్తిస్తారు. ప్రస్తుతం జిల్లాలో పౌష్టికాహార లోపంతో 456 మంది బాధపడుతున్నట్లు అధికారులు తెలిపారు. సూపర్‌వైజింగ్ ఫీడింగ్ ద్వారా సాధారణ స్థితికి రావడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. పిల్లలకు డబ్బా పాలు పట్టడం ద్వారా పిల్లలు ఎదుగుదల లోపించి ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని ఐసీడీఎస్ అధికారులు ప్రతి ఏటా తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించి చిన్నారుల తల్లులకు అవగాహన కల్పిస్తున్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి

ప్రస్తుతం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు 16 కోడి గుడ్లు, రోజుకు 100 గ్రాములు చొప్పున నెలకు సరిపడా బాలామృతం, రోజుకు 20 మురుకులను ఇంటికి పంపిస్తున్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్లలో పిల్లలకు రోజుకు ఒక గుడ్డు చొప్పున నెలకు 30 ఉడకబెట్టిన గుడ్లతో పాటు అంగన్‌వాడీ పరిధిలో 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, ఐదు గ్రాముల నూనె, ఒక పూట సంపూర్ణ భోజనం అందిస్తున్నారు. వయస్సుకు తగ్గ ఎత్తు బరువు లేకుండా ఉన్న పిల్లలకు అందించే పౌష్టికాహారంతో పాటు అదనంగా ప్రత్యేక ఆహారాన్ని అందిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లాలో మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. పెబ్బేరు ప్రాజెక్టులో 189 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 7,153 చిన్నారులు, వనపర్తిలో 249 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 10,622 చిన్నారులు, ఆత్మకూర్ పరిధిలో 151 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. 8,481 చిన్నారులు ఉన్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



జిల్లాలో 456 మంది చిన్నారుల్లో పౌష్టికాహార లోపాలను గుర్తించాం. అంగన్‌వాడీ కేంద్ర ద్వారా అందించే పౌష్టికాహారం ప్రతిరోజు బాలామృతం. 100 మిల్లీలీటర్ల పాలు, గుడ్డు, బరువు తక్కువ ఉన్న పిల్లల్లో పోషక లోపాన్ని గుర్తించి, వారికి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య పరీక్షలే కాకుండా మెరుగైన చికిత్స కోసం ఎన్‌ఆర్‌సీకి పంపిస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యలను సాధిస్తున్నాం.

– లక్ష్మీబాయి, ఐసీడీఎస్

ముగిసిన మంత్రాలమ్మ ఉత్సవాలు



అలంకరణలో మంత్రాలమ్మ అమ్మవారు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

కొడేరు: మండలంలోని జనుంపల్లి శివారులో వెలిసిన గంగ మంత్రాలమ్మ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 14 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం నెల పూజ కార్యక్రమంతో వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు చీర సారేతో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. గాజుల దుకాణంలో మహిళలు, ఆట వస్తువులు దుకాణాల వద్ద చిన్నారుల సందడి కనింపించింది. వివిధ కార్యక్రమంలో పూజారి రాములు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రేపు సామూహిక వ్రతాలు..

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని రామాలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందడై వరదరాజల్‌అయ్యంగార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్యసాయి సేవా సమితి సామూహిక భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

వైభవంగా రంగనాయకస్వామి పల్లకీ సేవ



స్వామివారి పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని శ్రీపురంలో కొలువుదీరిన రంగనాయకస్వామి వార్షిక అధ్యయన ఉత్సవాలు మూడు రోజులు పాటు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. చివరి రోజు ఆదివారం స్వామివారి పరమపద ఉత్సవం, పల్లకిసేవ, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రంగాచార్యులు, మురళీధరాచార్యులు, అర్చకులు వినోదాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, వరదయ్య, చంద్రనారాయణ, మాధవన్‌రెడ్డి, గోపినాథ్, మల్లికార్జున్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయనోనిపల్లి మైసమ్మ దేవతను దర్శకునేందుకు ఆదివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తవాహనాలను ఆలయం చుట్టు తిప్పి పూజలు చేశారు. పొటేళ్లను బలిచ్చి బంధు, మిత్రులకు విందు ఏర్పాటు చేశారు. మొత్తం 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునట్లు ఎండోమెంట్ అధికారి రంగారావు తెలిపారు.



మైసమ్మ దేవత చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కేసు నమోదు

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అచ్చంపేట మండలం నడింపల్లికి చెందిన వడ్డెర శ్రీశైలం గాయపడ్డాడు. ఎస్‌ఐ లెనిన్ వివరాల ప్రకారం వంగూరు మండలం చౌదర్‌పల్లి శివారులోని మైనింగ్ క్వారీ వద్ద పనులు ముగించుకొని బైక్‌పై అచ్చంపేట వైపు వడ్డెర శ్రీశైలం వస్తున్నాడు. ఎదురుగా కాంసానిపల్లితండాకు చెందిన కాట్రావత్ శివ బైక్ ఢీకొన్నది. బాధితుడి అల్లుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బిగుసుకున్న షట్టర్లు

- పట్టించుకోని ఐబీ అధికారులు
- షట్టర్లు పాడైపోవడంతో వృథా అవుతున్న నీరు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు



ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లిలో కూలిపోయిన బ్రాహ్మణ కుంట అలుగు

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల చెరువుల తూములకు ఏర్పాటు చేసిన షట్టర్లు పాడైపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు సంవత్సరాల కిందట షట్టర్లు పాడైనట్లు రైతులు, ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు స్పందించకపోవడంతో రైతులు తూముల నుంచి నీటిని తీయడానికి అవస్థలు పడుతున్నారు. వర్షం వచ్చి చెరువుల్లోకి చేరిన నీరు వృథాగా బయటకు వెళ్తున్నాయి.

తూములు తెరవడానికి ఇబ్బందులు..

మండలంలోని ఆగారం రెడ్ల చెరువు, అప్పారెడ్డిపల్లి మత్రిచెరువు, బ్రాహ్మణ కుంట చెరువు, షాపురం కోతులకుంట చెరువులతో పాటుగా పలు గ్రామాల్లోని చెరువుల తూములు పాడై సంవత్సరం కావొస్తున్నా.. ఐబీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల కింద సాగు చేసిన పంటలకు నీటిని పారించడానికి తూము తీసిన, వేసిన రోజూ ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. నీటిలో మునిగి తూము షెట్టర్ తీస్తున్నామని వాపోతున్నారు. చెరువులకు సాగునీరుగాని వర్షపు నీరుగాని వచ్చి చేరినప్పటికీ షెట్టర్లు పాడైపోవడంతో నీళ్లు తూము ద్వారా బయటకు వెతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం ఇప్పుడైనా అధికారులు స్పందించి మరమ్మతు చేపడితే వచ్చే వర్షాకాలంలో నీరు వృథాగా బయటకు వెల్లకుండా నిల్వ ఉంటాయని కోరుతున్నారు. అప్పారెడ్డిపల్లి, బ్రాహ్మణకుంట చెరువు అలుగు గోడ మొత్తం కూలిపోయింది. నీళ్లు కారకుండా వేసిన ఆర్‌సీ మాత్రమే ఉంది. అది కూడా ఎప్పుడు కూలిపోతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలుగు కూలిన విషయం నీటిపారుదల శాఖ అధికారులకు చెప్పినా.. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

మండలంలోని పలు గ్రామాల చెరువుల తూములకు ఏర్పాటు చేసిన షెట్టర్లు పాడైన విషయాన్ని రైతులు నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు షెట్టర్ల కాంట్రాక్టర్‌కు చెప్పారు. త్వరలోనే ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

– వెంకటేశ్వర్లు, ఐబీ ఏఈ

యూనిఫాం కుట్టు కూలి చెల్లింపు



యూనిఫాంతో విద్యార్థులు

పాన్‌గల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించి గతేడాది యూనిఫాం కుట్టిన వారి కూలీ చెల్లింపులకు ప్రభుత్వం తాజాగా నిధులు మంజూరు చేసిందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ఆర్థిక సంవత్సరంలో మార్చి నెల ముగింపు కావడంతో బకాయిలు చెల్లించిందని, మండలంలోని ప్రభుత్వ, కస్తూర్బా పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో నిధులు జమయ్యాయని పేర్కొన్నారు. యూనిఫాం కుట్టిన దర్జీలు కూలీ కోసం ఏడాది కాలంగా నిరీక్షించారని అన్నారు. ఇన్నాళ్లకు వారి ఎదురుచూపులు ఫలించాయన్నారు. మండలంలో 3 ప్రాథమికోన్నత, 36 ప్రాథమిక, 10 ఉన్నత, 1 కస్తూర్బా విద్యాలయంతో కలిపి మొత్తం 3,663 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఒక్కొక్క విద్యార్థికి రెండు జతల చొప్పున ఏకరూప దుస్తులకు సంబంధించిన రూ.3.66 లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. మంజూరైన నిధులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాల నుంచి దర్జీలకు అందజేస్తారన్నారు.

కాముడి బొమ్మతో శవయాత్ర



ఆత్మకూర్‌లోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద..



అమరచింత బీసీ కాలనీలో..

అమరచింత: కాముడి పూర్ణిమను పురస్కరించుకుని పట్టణంలోని జగన్‌వాడ, బీసీ కాలనీలో ఆదివారం కాముడి దిష్టిబొమ్మతో శవయాత్రను పట్టణ పురవీధుల వెంట నిర్వహించారు. ఆయా వార్డులకు చెందిన యువకులు, చిన్నారులు కాముడి దిష్టిబొమ్మను తయారు చేసి వాటిని పాడెపై పడుకోబెట్టి ఊరేగించారు. పాడె ముందు మహిళ వేషధారణతో ఆయ్యో నా మొడుగు చనిపోయాడమ్మ దహన ఖర్చులకు సాయం చేయ్యండమ్మా అంటూ ఏడుస్తూ డబ్బులను వసూలు చేశారు. వీటిని పోగు చేసి కాముడిని దహనం చేస్తూ.. గుగ్గిళ్లను అదే మంటలో ఉడకబెట్టి వాడంతా పంచడం ఆనావాయితీగా వస్తుందని యువకులు తెలియజేశారు.

ఆత్మకూర్: రంగు రంగుల హోలీ వేడుకలను సోమవారం జరుపుకోనున్నారు. ఆదివారం రాత్రి ఆత్మకూర్‌లోని నేతాజీనగర్, కేషవస్వామి నగర్‌లో యువకులు, చిన్నారులు కాముడి దిష్టిబొమ్మను ఊరేగించారు. చెన్నస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద అగ్నిగుండాలను ఏర్పాటు చేసి కాముడి దహనం చేశారు.

హోలీ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

పాన్‌గల్: హోలీ పండుగను సాంప్రదాయాలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ వేణు యువత, మండల ప్రజలకు సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హోలీ పండుగను సురక్షితమైన రంగులను వాడాలని, హోలీ అనంతరం చెరువుల్లో, లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలు నడిపే క్రమంలో అతివేగం, త్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ వంటి వాటిని మానుకొని నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కనిపెడుతూ జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమరచింత: హోలీ పండుగను మతసామరస్యంతో ప్రతిఒక్కరూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపారు. సోమవారం హోలీ సందర్భంగా యువకులు రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతూ ఇతరులకు ఇబ్బందులు కలుగజేయకుండా పండుగను జరుపుకోవాలన్నారు. మద్యం తాగి ద్విచక్ర వాహనాలను రహదారులపై తిప్పుతూ ప్రజలకు ఇబ్బందులు పెడుతున్న వారిపై చర్యలు తప్పవన్నారు. బావులు, చెరువుల్లో ఈతకు వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు.

జానపద కళాకారుల మండల కమిటీ ఎన్నిక



జానపద కళాకారుల సంఘం

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయం ఆవరణలో ఆదివారం జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీకే గౌడ్ సమక్షంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వాడల భీముడు, గౌరవాధ్యక్షుడిగా ఆవుల హన్మంతు, ఉపాధ్యక్షుడిగా మర్రిపల్లి బాలస్వామి, బుచ్చయ్య, గీత, ప్రధాన కార్యదర్శిగా ఎన్. హతిరాం, సహాయ కార్యదర్శులుగా ఆర్ రమేష్, శేషు, కోశాధికారిగా ఆకుల స్వామి, ప్రచార కార్యదర్శులుగా మర్రిపల్లి వెంకటేష్, పరశురాములు, చాకలి శ్రీను, తిర్పతయ్య, శివలక్ష్మి, సలహాదారులుగా ప్యారం లక్ష్మినర్సును ఎన్నుకున్నారు. ఈసందర్భంగా పీకేగౌడ్ మాట్లాడుతూ జానపద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బల్మూర్: జానపద కళాకారుల సంఘం మండల అధ్యక్షుడిగా గోదల్ గ్రామానికి చెందిన మద్దెల అర్జున్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా లింగం, ప్రధాన కార్యదర్శిగా కృష్ణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

అమరచింత: మండలంలోని నాగల్ కద్మూర్‌లో 2005–06 విద్యాసంవత్సరంలో ఎడో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమేళనం నిర్వహించారు. అప్పట్లో గ్రామంలో ఏడో తరగతి వరకే ప్రభుత్వ పాఠశాల ఉండటంతో ఉపాధ్యాయులు బోధించిన విషయాలను చక్కగా నేర్చుకొని తమ జీవితాల్లో స్థిరపడ్డామన్నారు. ఈ మేరకు అప్పట్లో తమకు చదువు నేర్పిన గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ జ్ఞాపకాలను ఒకరి తర్వాత ఒకరు పంచుకుంటూ సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు అందించిన పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఉపాధ్యాయులు టి.కురుమన్న, చంద్రశేఖర్, నజీర్ అహ్మద్, కె.నర్సింహులు, రవికుమార్, రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పెబ్బేరు రూరల్: శ్రీనివాసపూరు శివారులో ప్లాట్‌ను ఆక్రమించి చిన్న పాటి గుడి నిర్మాణం చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి పట్టణానికి చెందిన లక్ష్మికి శ్రీనివాసపూర్ గ్రామ శివారులో సర్వే నం 45లో ప్లాట్ ఉంది. ఆమె తన ప్లాట్‌లో ఇంటి నిర్మాణం చేస్తున్న క్రమంలో ఆ ప్లాట్‌ను వనపర్తి పట్టణానికి చెందిన కటికె బగవాన్‌జీ, నరేష్‌జీ , దర్మేష్‌జీ ముగురు కలిసి దౌర్జన్యంగా నిర్మాణాన్ని పడగొట్టి ప్లాట్‌ను కబ్జా చేసి, ప్లాట్‌లో చిన్నపాటి హనుమాన్ ఆలయం నిర్మించారు. ప్లాట్ యజమాని లక్ష్మి తన ప్లాట్‌లోని ఆలయం తీసివేసి కటికె బగవాన్‌జీ, నరేష్‌జీ, దర్మేష్ జీపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలియజేశారు. వనపర్తి పట్టణ శివారులో ఎవరైన అక్రమంగా ప్లాట్లను కబ్జాచేసి బాధితులను ఇబ్బందులకు గురిచేస్తే.. వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.